



sahanamvande.com
epaper.sahanamvande.com
# సహనం వందే
హైదరాబాద్ | 01-07-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 91 EDITOR: ROHINI




# బెంగాల్‌లో ముస్లిం రిజర్వేషన్లు ఔట్

## 77 ముస్లిం కమ్యూనిటీల ఓబీసీ కోటాకు కత్తెర

- అయితే 66 కమ్యూనిటీలకు కొనసాగింపు
- రిజర్వేషన్లు 7 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం
- దూకుడు మీదున్న బెంగాల్ బీజేపీ ప్రభుత్వం




**పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో సంచలనం చోటుచేసుకుంది. ఓబీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గత ప్రభుత్వం కల్పించిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ ఏకంగా 77 ముస్లిం కమ్యూనిటీలను జాబితా నుంచి తొలగించారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని సామాజిక సమీకరణాలను మరోసారి వేడెక్కించింది.**

**- సహనం వందే, పశ్చిమ బెంగాల్**

ముస్లిం కమ్యూనిటీలలో కూడా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వివిధ ఉప సమూహాలు ఉంటాయి. హిందూ మతంలోని కుల వ్యవస్థ మాదిరిగానే ముస్లింలలో కూడా వృత్తిపరమైన నేపథ్యాలు కలిగిన సమూహాలు విడివిడిగా ఉంటాయి. గత ప్రభుత్వం వీటిలో 77 రకాల విభిన్న సమూహాలను ఓబీసీ జాబితాలో చేర్చి రిజర్వేషన్లు కల్పించింది. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఆ 77రకాల సామాజిక వర్గాలకు ఓబీసీ హోదాను తొలగించి ఆ రిజర్వేషన్ ప్రయోజనాలను నిలిపివేశారు.

### 66 కమ్యూనిటీల కొనసాగింపు

మంత్రి గౌరీశంకర్ ఘోష్ అసెంబ్లీలో స్పష్టత ఇచ్చారు. తగు సర్వేలు నిర్వహించి శాస్త్రీయంగా వెనుకబడినవిగా గుర్తించిన 66 ముస్లిం కమ్యూనిటీలను మాత్రం ఓబీసీ జాబితాలోనే కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు. అంటే ఏవైతే కమ్యూనిటీలు గతంలో సరైన సర్వే ప్రక్రియ ద్వారా ఓబీసీ హోదా పొంది ఉన్నాయో వాటికి ఈ కోత వర్తించదని ప్రభుత్వం వెల్లడించింది. ఎటువంటి సర్వేలు లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేర్చిన 77 కమ్యూనిటీలను మాత్రమే తొలగించామని మంత్రి స్పష్టం చేశారు.

### చట్టసభలో ఆమోదం


పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ కీలకమైన రెండు బిల్లులను ఆమోదించింది. ఇవి ఓబీసీ రిజర్వేషన్ల చట్టాలను పూర్తిగా మార్చివేశాయి. వీటి ద్వారా ఈ 77 ముస్లిం కమ్యూనిటీలను ఓబీసీ జాబితా నుంచి అధికారికంగా తొలగించారు. 2024 మే నెలలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో పాటు ఓబీసీ రిజర్వేషన్ కోటాను 10శాతం నుండి 7శాతానికి తగ్గించారు.

### అవకతవకలే కారణమా?

ఈ తొలగింపుపై వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గౌరీశంకర్ ఘోష్ అసెంబ్లీలో వివరణ ఇచ్చారు. గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి సర్వేలు నిర్వహించకుండానే, కేవలం ముస్లింలకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించడమే లక్ష్యంగా కొన్ని కమ్యూనిటీలను ఓబీసీ జాబితాలో చేర్చిందని ఆయన ఆరోపించారు. ఇకపై వెనుకబడిన తరగతుల కమిషన్ ద్వారానే సామాజిక, ఆర్థిక స్థితిగతులపై వాస్తవ అంచనా వేస్తామని ఆయన వెల్లడించారు. నకిలీ ఓబీసీ ధృవీకరణ పత్రాల జారీకి అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

### యూనిఫాం సివిల్ కోడ్ అమలు దిశగా

రిజర్వేషన్ల సవరణతో పాటు మరో కీలక అంశాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. రాష్ట్రంలో వచ్చే ఆగస్టు నుంచి యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని ఆయన తెలిపారు. యూనిఫాం సివిల్ కోడ్ అమలు కావాలనేదే తమ విధానమని, అందుకే ప్రజలు బీజేపీకి ఓటు వేశారని మంత్రి ఘోష్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో గుండా దమన్ అంటే నేర నియంత్రణ బిల్లును కూడా సభలో ఆమోదించడం గమనార్హం.



### వ్యతిరేకిస్తున్న విపక్షాలు

ప్రభుత్వ నిర్ణయాన్ని ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ తీవ్రంగా వ్యతిరేకించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్ల పరిమితిని మార్చాలంటే కచ్చితమైన గణాంకాలు లేదా శాస్త్రీయ అంచనాలు అవసరమని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఎటువంటి డేటా లేకుండానే ఓబీసీ రిజర్వేషన్లను తగ్గించడం సరికాదని ఆయన మండిపడ్డారు. ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాలు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని సిద్ధిఖీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక న్యాయం అనే భావననే దెబ్బతీస్తుందని ఆయన వాదించారు.

# శేష జీవితంలో కొత్త ఆశలు

## ముసలితనంలో పెరుగుతున్న విడాకులు

**జీవితం చరమాంకంలోకి అడుగుపెడుతున్న వేళ జంటల మధ్య దూరం పెరుగుతోంది. ఏళ్లుగా సాగిన సంసారాలు ఇప్పుడు విడాకుల బాట పడుతున్నాయి. పిల్లలు పెద్దలై వేరు కావడం, రిటైర్మెంట్ తర్వాత ఖాళీ సమయం పెరగడం వెనుక ఉన్న అసలైన చిచ్చును రగిలిస్తోంది. మనిషి జీవిత కాలం పెరగడంతో ఇప్పుడు కొత్త జీవితం కోరుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా తమదైన సంతోషం కోసం పాత బంధాలకు స్వస్తి పలుకుతున్నారు.**

**- సహనం వందే, హైదరాబాద్**

- దశాబ్దాల బంధం ముగింపుకు తగ్గేదేలే...
- పెరిగిన సగటు ఆయుర్దాయం ప్రధానం
- మరోవైపు మారిన సామాజిక విలువలు
- ఆర్థిక స్వేచ్ఛతో వ్యక్తిగత సంతోషమే లెక్క
- ఒంటరిగా జీవించగలమనే ధైర్యమే ధీమా
- బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధన



ప్రపంచవ్యాప్తంగా 1990లో 50 ఏళ్లు పైబడిన వారిలో విడాకుల శాతం కేవలం 8గా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. 2022 నాటికి 65 ఏళ్లు పైబడిన వారిలో విడాకుల శాతం ఏకంగా 15.2కి చేరింది. 1990లో ఇది కేవలం 5.2 శాతంగానే ఉండేది. అంటే ఈ మూడు దశాబ్దాల్లోనే ఈ సంఖ్య మూడు రెట్లు పెరిగింది. నేడు విడాకులు తీసుకుంటున్న వారిలో ప్రతి 10 మందిలో ఒకరు 65 ఏళ్లు పైబడిన వారే కావడం గమనార్హం.

### ఆయుష్షు పెరగడంతో విడాకులు వైపు...

ఆరోగ్యకరమైన జీవనశైలితో ఇప్పుడు మనిషి ఆయుష్షు బాగా పెరిగింది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటితే ముసలితనం అనుకునే వారు. కానీ ఇప్పుడు 70 ఏళ్లు వచ్చినా యువతలాగే ఫీలవుతున్నారు. బతకడానికి ఇంకా చాలా సమయం ఉందని తెలియడంతో కొందరు కొత్త జీవితాన్ని మొదలుపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. సుదీర్ఘకాలం ఒకే బంధంలో ఉండి విసుగు చెందిన వారు ఇప్పుడు స్వేచ్ఛగా బతకాలని నిర్ణయించుకుంటున్నారు.

### ఆర్థిక స్వేచ్ఛతో ధైర్యం

మహిళలు ఇప్పుడు ఆర్థికంగా స్వతంత్రులుగా మారుతున్నారు. తమకు తాముగా బతకగలమనే నమ్మకం పెరిగింది. ఆస్తిపాస్తులు, పెన్షన్లు, పొదుపు పథకాలతో ఆర్థిక ఇబ్బందులు లేని వారు విడిపోయేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. ఆర్థిక భరోసా ఉండటంతో అణచివేతను లేదా అసంతృప్తిని భరించడం కంటే విడాకులు తీసుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. డబ్బు సమస్యలు తీరడంతో భాగస్వామిపై ఆధారపడాల్సిన అవసరం తగ్గింది.

### ఖాళీ గూడు చిచ్చు

పిల్లలు పెద్దలై ఉద్యోగ రీత్యా వేరే ఊర్లకు వెళ్లిపోతున్నారు. ఇన్నాళ్లూ పిల్లల కోసమే కాపురం నెట్టుకొచ్చిన తల్లిదండ్రులు ఇప్పుడు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఇంట్లో పిల్లలు లేకపోవడంతో భార్యాభర్తల మధ్య సంబంధం తెగిపోతోంది. ఏ విషయమైనా పంచుకోవడానికి ఇద్దరి మధ్య ఉమ్మడి లక్ష్యాలు లేకపోవడం సమస్యగా మారుతోంది. ఈ ఖాళీ గూడు సిండ్రోమ్ బంధాల్లో పెద్ద చిచ్చు పెడుతోంది.

### పునర్వివాహాల వెనుక రిస్క్

బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం గతంలో జరిగిన విడాకుల వల్ల కొందరు రెండోసారి పెళ్లి చేసుకున్నారు. మొదటి పెళ్లి కంటే రెండో పెళ్లి విడిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తేలింది. 1970లలో విడాకులు చూసిన వారే ఇప్పుడు ముసలితనంలో విడాకులు తీసుకుంటున్నారు. పాత తరం వారిలా రాజీ పడి బతకడానికి నేడు సిద్ధంగా లేరు.

### సమాజంలో మారిన దృక్పథం

విడాకులు అంటే సమాజంలో ఉన్న తక్కువ చూపు ఇప్పుడు తగ్గిపోయింది. పెళ్లి అంటే జీవితాంతం కలిసి బతకాలని ఎవరూ కండిషన్ పెట్టడం లేదు. మనిషి సంతోషమే ప్రధానమని భావిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు, మనస్పర్థలు ఎదురైనప్పుడు ఆ బంధాన్ని కొనసాగించడం కంటే విడిపోవడమే మంచిదని డిసైడ్ అవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బంధాల్లో కూడా మార్పులు వస్తున్నాయి.

# యాదాద్రి బోర్డులో మెగాస్టార్ సతీమణి

## యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు నియామకం

**యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు నియామకం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరతీసింది. స్వామివారి సన్నిధి పాలనా పగ్గాలు కొత్త చేతుల్లోకి వెళ్లాయి. అయితే అందరి దృష్టిని ఒకే ఒక్క పేరు అమితంగా ఆకర్షిస్తోంది. సినీ రంగంతో విడదీయలేని అనుబంధం ఉన్న కొణిదెల సురేఖ పేరు ఈ బోర్డులో కనిపిస్తుండటంతో అంతా ఆసక్తిగా చూస్తున్నారు.**

**- సహనం వందే, హైదరాబాద్**

- రెండేళ్ల పదవీ కాలం... ఆలయానికి సినీ కళ
- బోర్డు సారథిగా సత్యనారాయణ రెడ్డి



ఈ జాబితాలో మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ పేరు ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమె నియామకం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్రముఖ సినీ కుటుంబానికి చెందిన సురేఖ బోర్డులో సభ్యురాలిగా రావడం ఆసక్తికరంగా ఉంది. ఆమెతో పాటు మరో 9 మందిని సభ్యులుగా నియమించారు. వినోద్ వెంకటస్వామి, చిలప్పగారి విజయరాజం, విజయేందర్ తుల్లా, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ఈ బోర్డులో కీలక సభ్యులుగా ఉన్నారు.

### సారథిగా సత్యనారాయణరెడ్డి

బోర్డు చైర్మన్ బాధ్యతలను ఎం.సత్యనారాయణ రెడ్డి చేపట్టనున్నారు. ఆధ్యాత్మిక క్షేత్ర అభివృద్ధిలో ఆయన ముందుండి నడిపించాల్సి ఉంది. ఆయన నాయకత్వంలోనే భవిష్యత్ కార్యాచరణ అంతా సాగనుంది. దేవస్థానాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ఉంచేందుకు ఆయన సమాయత్తమవుతున్నారు. ఆయనతో పాటు మొత్తం 17 మంది సభ్యుల బృందం స్వామివారి సేవలో భాగస్వాములు కానున్నారు.

### సభ్యుల పూర్తి బలగం

గుండు మల్లయ్య, స్వాతి కంతమణి, ఎం.రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు వ్యవస్థాపక ధర్మకర్త కూడా బోర్డులో సభ్యుడిగా ఉంటారు. వైవిధ్యమైన నేపథ్యాలు ఉన్న వ్యక్తులకు చోటు కల్పించడం ద్వారా పాలనను సమర్థవంతంగా చేయాలని ప్రభుత్వం ఆశిస్తోంది. సభ్యులందరికీ రెండేళ్ళ కాలపరిమితిని నిర్ణయించారు.

### అధికారుల భాగస్వామ్యం

పాలనలో అధికారులు కూడా కీలక భాగస్వాములుగా ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్ బోర్డులో ఉన్నారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్, యాదాద్రి టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ కూడా ఉన్నారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి, ప్రధాన అర్చకులు కూడా ఈ బృందంలో ఉండటం వల్ల పనులు వేగంగా జరుగుతాయి.

### చట్టబద్ధమైన నియామకం

ఈ నియామకాలన్నీ హిందూ మతపరమైన సంస్థల చట్టం ప్రకారం పారదర్శకంగా జరిగాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేవస్థాన అభివృద్ధికి కొత్త ఊపునివ్వనుంది. నిబంధనలను అనుసరిస్తూనే అత్యున్నత ప్రమాణాలతో పాలన సాగించాలని నిర్ణయించారు. చట్టంలోని సెక్షన్ల ప్రకారం ప్రభుత్వం తన అధికారాలను వినియోగించుకుని ఈ బోర్డును ఏర్పాటు చేసింది.

### ప్రమాణ స్వీకారమే తదుపరి అడుగు

ఇప్పుడు అందరి చూపు ప్రమాణ స్వీకార కార్యక్రమంపై ఉంది. కార్యనిర్వహణ అధికారి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగనుంది. చైర్మన్, సభ్యులందరూ త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నారు. స్వామివారి సేవలో కంకణబద్ధులై దేవస్థాన కీర్తిని దశదిశలా వ్యాపింపజేయడమే కొత్త బోర్డు ముందున్న ప్రధాన లక్ష్యం.